




# అనువైన ఆత్మహత్య

అవసరాల రామకృష్ణారావు







అందర్నీ వదులుకుని నిన్నే నమ్ముకున్నాను. ఆఖరికి నువ్వే నన్ను మోసం చేస్తావా? ఇంత కృతఘ్నతా! ఇంత బరితెగించావా? ఇంతగా సిగ్గులేక పోయిందా? చూడు ... ఏ న్నేం చేస్తావో చూడు... ?

"ఎవరితో ఆయన మాటాడుతున్నదీ ?"

"నాకు తెలిసినంతవరకూ గదిలో ఆయన ఒక్కరే ఉన్నారు!" అన్నాడు హెడ్‌గుమాస్తా. తెలుగు మాష్టరు అందుకున్నాడు :

"ప్రొద్దుట్నుంచీ అదోలా వున్నాడు. కొంపతీసి బ్రాహ్మడికి వెర్రెత్తలేదుగద !"

"పదండి అక్కడికెళ్ళి అదేమిటో ఆయన గదిలోనే చూద్దాం."

పదండంటే పదండని అందరూ హెడ్మాస్టారి రూం చేరుకున్నారు.

"మేస్టారూ, తలుపు తీస్తారా ?'' మెల్లిగా పిలిచారు. దడదడ బాదేరు. ఇంకా జవాబు రాకపోతే బలవంతాన తలుపులు ఊడదీయించారు. అదెవరితో మాటాడుతున్నాడో ఆ అదృశ్యశక్తి లేదు సరిగదా ఆ గదిలో హెడ్మాస్టరే లేడు! ఊచలు లేని కిటికీతలుపులు మాత్రం బార్లా తీసుకున్నాయి. మూడంతస్థుల ఆ మేడమీది మూల గది కిటికీలోంచి పైకి బుర్ర పెట్టి కిందకి తొంగిచూసి "రామరామ, ఎంత ఘోరం!"అనుకున్నారు మేష్టర్లూ, కుర్రాళ్ళూ. ఆ గదిలో ఎప్పుడూ ఉండేదీ, అతి ముఖ్యమైనది మరొకటీ లేకపోవడం మాత్రం చాలామంది గమనించనే లేదు!

*　　　*　　　*

హయ్యర్ సెకండరీ హైస్కూలు హెడ్‌మాస్టర్ హనుమంతయ్యగారికి ఆ మధ్య ఒకసారి కడుపులో, ఏదో కంతి పెరిగి ఆపరేషన్ చెయ్యవలసివచ్చింది. ఒక ప్రైవేటు హాస్పటల్లో పదిరోజు లున్నారు జయప్రదంగా శస్త్ర చికిత్స జరిగి పుండు మానిందని తెలిసిందగ్గిర్నుంచీ ఆయన్ని పట్టుకోడం కష్టమైపోయింది. అక్కడున్న డాక్టర్లు యిలా అనుకున్నారు : "ఈ వారం రోజులూ ఎలా ఉండగలిగాడో మా నాయన. ఇంకా యీయన్ని గొలుసు

లేసి కట్టడం మనవల్ల గాదు. డిశ్చార్జి చేసెయ్యమని ఏరోజుకారోజు పీకేస్తున్నాడు. రెండ్రోజుల్లో పంపించెయ్యడం బెస్టు. ఇంటిమీద ధ్యాస ఎక్కువైనట్టుంది."

"చిన్నప్పుడే తల్లిపోతే కనిపెట్టుకున్న ముసలిఅవ్వ ఒకర్తి ఉండిట ఈయనకి. వచ్చివరోగం కానిరోగంకదాని యీయన్నిలా హాస్పత్రిలో జాయిన్ చేసినట్టు ఆవిడకి తెలీకుండా కప్పెట్టేరుట. వెంటనేవెళ్ళి ఆవిణ్ణి చూడాలనుండడం నేచురల్ కదా!"

"మీ రింటికి వెళ్ళండి – ఇప్పుడు నేను బాగానే నడవగల్గుతున్నానుగదా... ఒక్కణ్ణీ రాగల్ను' అవి హనుమంతయ్యగారు భార్యనీ చిన్నకొడుకునీ యింటికి పంపేసి – హాస్పటల్‌నుంచి డిస్చార్జిఅయాక ఒక్కడూ రిక్షామీద బయలుదేరేడు; కాని ఆ రిక్షా ఇంటివైపు మళ్ళలేదు. తిన్నగా స్కూలువద్ద ఆగింది. స్కూలుగేటు ఎక్కి అటూ ఇటూ ఊగుతున్న కుర్రాడు "అమ్మ బాబోయ్, హెడ్మాస్టారు?" అని ఒక్కగెంతు గెంతి పరిగెత్తబోయాడు. కాలు మడతబడి లేవలేక పోతున్న సమయంలో హెడ్మాస్టారు రిక్షా దిగి వాణ్ణి దొరకపుచ్చుకున్నాడు. మిగిలిన పిల్లలేకాక, మేష్టర్లుకూడా ఎక్కడికక్కడ క్లాసుల్లో సర్దుకున్నారు. ఫుల్‌గా వాచీకి కీయిచ్చినట్టు వాడిచెవి నులిపి "ఒరే ఛండాలం, ఇక్కడున్నట్టు వెళ్ళి బంట్రోతుగాడిదలందర్నీ వెంటనే యిక్కడికి అఘోరించమని చెప్పు. ఆఫీసురూంలో ఆ పెద్ద గుమాస్తాపీనుగ ఉరెట్టుకుంటూ వుంటాడు. వీధిగుమ్మంలోకి పెద్దపులి వచ్చిందని చెప్పు." నిమిషాలమీద అందరూ గడగడలాడుతూ అక్కడ హాజరయ్యారు.

"అలా ఊఁ గుడ్లుమిటకరించి చూస్తావేమయ్యా, మరేం పనిలేనట్టూ? నిన్నేనయ్యా హెడ్‌గుమస్తా ఏడుకొండలూ... మాటిమాటికీ పైకి చెబుతేగాని వేడెక్కదా ఏమిటి. మాయదారి బోడిహోదా!"

"చిత్తం...చిత్తం..."

"వెంటనే వెళ్ళి టీచర్స్ ఎటెండన్సు రిజిష్టరు నా మొహాన్న కొట్టు..."

"ఏంరా తలుపులయ్యా, అలా నసుగుతూ కూడాకూడా తగలడకపోతే నా చేతిలో బెత్తం ఒకటి ఉండాలని నీకు తోచి చావకూడదూ?"

"అయఁ"

"చూడు సాంబశివం...లీజర్లో కొందరు మేష్టర్లుంటారు. ఏ సందులోనో అరువు బీడీ వెలిగిస్తూ ఊరంతటినీ చెరుగుతూ ఉంటారు. నే వచ్చాను, యీ పాటికి నిద్ర లేవమని చెప్పు...మరేం తప్పులేదు, నా ఎదుట పడమని చెప్పు."

"ఎంతమాట...తమ శలవు..."

ముందు హెడ్మాస్టరు బెత్తం పట్టుకునీ, వెనక అసిస్టెంట్లూ, బంట్రోతులూ కింద అన్ని క్లాసులూ చూశారు.

"చూశారా...సగం క్లాసుల్లో మేష్టర్లు లేరు...!"

"చిత్తం...చిత్తం...తమరు వస్తారని తెలియక...తిరిగి రాగలరని నమ్మక..."

"అంటే? ఆ హాస్పిటల్లో కాలుపెట్టిన నేను తిరిగి రానే రాననా!"

"పాపము శమించుగాక...ఎంతమాట, శలవిచ్చారూ? రారని కాదుగాని యింత తొందర్లో తమకు..."

"ఇది తొందరా? ఆ డాక్టరు చచ్చినాళ్ళు ఒదిలారు కాదుగాని. ఎప్పుడో పరిగెత్తుకొద్దును. నాలాంటివాడికి ముందు పనీ, తర్వాత ప్రాణమూ... అయినా మీ రెవరెంతగా మంచి కేండిడేటు యిక్కడ ఉండిపోయాడని యములాడికీ దరకాస్తులు పెట్టుకున్నా అంత త్వరగా కదిలే ఘటం కాదిది. ఒకటో రకమైన ద్రావిడ పిండాన్ని, ఏమనుకున్నారో...నాలుగు కాలాలపాటు బతకనా, నలుగుర్నీ నంజుకోనా? నా కేమిటి? పదండి పైకి వెడదాం."

సంస్కృతంమేష్టరు హనుమంతయ్య రెండుచేతులూ పట్టుకున్నాడు.

"తమకంటె పెద్దవాణ్ణి...నామాట కాదనకండి...మన్నించి నామాట కొంచెం చిత్తగించండి. తమరి శరీరం ఖాయిలాపడి ఉంది. ప్రస్తుతం నాడి అతి నీర్సంగా ఉంటుంది. ప్రకోపం తగ్గదు...విశ్రాంతి ఎంతయినా అవసరం...ఏమంటారు, శలవియ్యండి."

"ఏవండోయ్ పంతులుగారూ, మీ ఆయుర్వేదం యిక్కడకాదు. యింటిదగ్గర. నాలాంటివాడికి విశ్రాంతి ఒక్కసారే... చూశారుకదూ నాలుగురోజులు కనుమరుగయితే యిల్లు ఎలా వల్లకాడయిందోనూ? ఇంకా యింకా యింటిదగ్గర కూచుంటే యింతటి సంస్థ ఎవడి చంకనాకాలి? పదండి పదండి, కావలసినవి కబుర్లుకావు... టకటక టక పన్లు జరిగిపోవాలి, నెహ్రూగారు ఏమన్నారు?"

రెండో అంతస్థులో ఉన్న సైన్సు లేబొరేటరీ తలుపులు బార్లా తెరచిఉన్నాయి.

"రామావతారంగారూ, స్టాఫ్ ఆర్డరు బుక్కు పట్రండి ... వేలకి వేలు విలువ చేసే యింత ఎక్విప్‌మెంటుని వదిలిపెట్టి – ఆ సీనియర్ సైన్సు అసిస్టెంటు హైగ్రీవం ఏం చేస్తున్నాడో ఎక్స్‌ప్లనేషను అడుగుదాం..."

గుమాస్తా రామావతారానికి సందేహం వచ్చింది.

"చిత్తం ... తమ రివాళ డ్యూటీలోలేరుగదండి. అసిస్టెంటు హెడ్మాస్టరు అనంతశయనంగారు కదండీ యిన్‌చార్జీ ... మరి శలవలో ఉన్న మీ రెలా ఆర్డర్సు...?"

"అమాయకుడివి కనక బతికిపోయావుగాని రామావతారం, మిమ్మల్ని వెంటనే డిస్మిస్ చేసిఉందును. బతికుండగా మోసెయ్యాలని నన్ను చూస్తే మీకు అనిపించవచ్చుగాని ఊరంతా ఉష్మని ఊదెయ్యగల ఉద్దండంపిండాన్ని నేనే. స్వయంగా ఎదుట పడితే యింక యిన్‌చార్జీ ఏమిటోయ్! శలవు పెడితే కేన్సిల్ చేసుకోగల సమర్థత నాకు లేదా ఏమిటి? రిటైరయిన గవర్న

మెంటు నిర్భాగ్యపు పీనుగుల్లాగ 'మేం బతికున్నా మండహో' అని ప్రతినెలా సర్టిఫై చేయించుకో వలసిన అవసరం నా కేం లేదుగద!"

"ఎప్పటికైనా రాకపోరు చూడండి"– అందరి మనసుల్లోనూ ఉన్న విషయం ఆ విధంగా వెలిగ్రక్కినందుకు కళ్ళతో కృతజ్ఞత వెల్లడిస్తూ అందరూ అటు చూశారు. అయిపోయిన సిగరెట్టు ఆర్పేసి హైగ్రీవం కెమికల్సు పెట్టిన బీరవాచాటు నుంచి యివతలి కొచ్చాడు. ఒక్క తీరున పోసిన ఆ రైలురోడ్డులో సాధారణంగా యిలాంటి మొక్కలు మొలవవు. మొలిచినా నిలవవు. నలుగురూ కలిసి హైగ్రీవాన్ని చెడామడాతిట్టి హెడ్మాస్టరుకు క్షమాపణ చెప్పించారు.

"ఇలాంటి కుర్రకారుతో నా కేమిటి? నా సర్వీసంత లేదు యితని వయసూ!" ముందు హనుమంతయ్య నవ్వేడు; అందరూ గొల్లుమన్నారు. కొన్ని కథల్లో పాత్రల హాస్యంలాగ. ఇది నిజంగా ఎంజాయ్‌చేసినవాడు హైగ్రీవం ఒకడే...

మూడో అంతస్థుకూడా చేరి ... ఒకరూ ఒకరూ సమయానుకూలంగా జారిపోగా, ఏడుకొండలూ, హనుమంతయ్యా, పెద్దప్యూన్ తలుపులయ్యా హెడ్మాస్టరు రూం చేరేరు... దూరంనుంచే ఏదో వినబడుతోంది. "ఒరే తలుపులూ, కొంపమునిగింది; అనంతశయనంగారు పడుకున్నట్టున్నారు – అనేక శబ్దాలు వినబడుతున్నాయి. పరిగెత్తుకువెళ్ళి లేపు." ఏడుకొండలు తలుపులయ్యకు చేసిన హెచ్చరిక విననట్టు వెనకబడిపోయాడు హనుమంతయ్య.

"నమస్కారం...తమరి వంట్లో ఇప్పుడెలాఉంది?" అన్నాడు అనంతశయనం. అయన బట్ట ఆయన శరీరభాగాల్ని ఎప్పుడూ కప్పదు. జుట్టు మాత్రం ఎప్పుడూ సగం మొహాన్ని కప్పందే ఒప్పదు. ఇదీ ఆయనలో విశేషం.

"ఊఁ" అన్నాడు హనుమంతయ్య గర్జించినట్టు? ఒక్కొక్కప్పుడు ఎంత మాటకారో ఒక్కొక్కప్పుడు అంత మౌనధారి.

"ఇప్పుడు స్కూలుఫైనలు – 'ఈ' మీకు వర్కున్నట్టుంది. వెళ్ళండి తర్వాత మాటాడదాం." ఏడుకొండలూ, ఆయనా వెళ్ళిపోయారు. హనుమంతయ్య తను కూర్చునే కుర్చీవైపు చూశాడు.

అది రంగూన్‌నుంచి ప్రత్యేకం తెప్పించిన టేకుకుర్చీ. కిందా, వెనకా, చేతుల దగ్గిరా అన్నిచోట్లా డన్‌లప్ కంపెనీ వారి మెత్తలు అమర్చబడిన కుర్చీ. మీటరు ఇరవై రెండున్నర పెట్టి విక్టెడ్ చెర్లిన్ గుడ్డ కొని, ప్రత్యేకించి బెంగుళూరు టయిలర్సు చేత గలీబులు కుట్టించబడిన దిండ్లుగల కుర్చీ. మూడంతస్థుల మేడమీద మూలనున్న ముఖ్యమైన గదిలో ముచ్చటగా ముస్తాబయిన కుర్చీ. ఏడువందల ఏభై మంది విద్యార్థుల్నీ, ముప్పైమంది యుపాధ్యాయుల్నీ ఏలడానికి ప్రత్యేకించి పెట్టిపుట్టిన అదృష్టశాలి అమరసింహాసనం ఆ కుర్చీ. అయిదువందలు జీతమూ, అనన్యమైన అధికారమూ అందుమీద కూర్చుంటే చాలు అందించే కల్పతరువు ఆ కుర్చీ. పామరులు దానికి ప్రాణం లేదనుకోవచ్చు – కేవలం కర్రముక్క అని కొట్టి పారెయ్యవచ్చు. కాని దానితో మాట్లాడగలిగినంత ప్రేమించిన హనుమంతయ్యగారు ఏమంటాడు?

"నేను లేని ఈ పదిరోజులూ నాకోసం బెంగెట్టుకున్నావుటే వెర్రిదాన!" కుర్చీ చెయ్యిమీద తన చెయ్యి వేసి ముద్దెట్టుకుందామని మూతిదగ్గిర పెట్టుకున్నాడు హనుమంతయ్య. గుప్‌మని కంపు కొట్టింది, పొడుం నాపన! "ఇంకేముంది, ఆ అనంతశయనం నేన్లేకుండా చూసి దీనిమీద తగలడ్డాడు కాబోలు... రామ రామ...అపవిత్రం అయిపోయింది. కుండెడు కూటినీ కుక్క ముట్టుకుంది! అది తనస్థానం కాదని చెబితే వినదు గద ఏబ్రాసిమొహం...ఒరే తలుపులూ... ఇలా వచ్చి యిదంతా శుభ్రం చెయ్యి... శుద్ధిపుణ్యాహవాచన చేసినా ఈ దరిద్రం వదల్దురా బాబూ... వెళ్ళి తీసుకురా... కలరా ఉండలూ, ఫినైలూ, డెట్టాలూ... కొంచెం గోమయమూ, తులిసాకులూ, ఒక వైష్ణవోత్తముడూ...

హనుమంతయ్యగారు ఇల్లు చేరుకునేసరికి యింటినిండా మనుషులూ డాక్టర్లూ నానా హడావిడిగానూ ఉంది. భ్రమరాంబ ఆయన్ని గబగబా లోపలికి తీసుకుపోయింది.

"మీ కేమన్నా మతుందా, పోయిందా? అంత జబ్బు చేసి ఆస్పత్రినుంచి విడుదలయిన మనిషి దారిలో ఏ శోషవచ్చి పడిపోయారో అని నేనూ పిల్లలూ ఎంత కొట్టుకుపోయామో మీ కేం తెలుసు! అయినా అదే ఉండిపోడమా? మనస్సుకున్న నిబ్బరం శరీరాని కుండొద్దూ? ఏం చిత్రమైన మనిషి బాబూ! ఇప్పటికైనా ఆస్కూలు విడచిపెట్టి రావాలని బుద్ధెలాపుట్టిందో. ఆశ్చర్యమే! ఇవతలేమో అవ్వగారికి వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా ఉంది. అసలే పెద్దకాలం, రెండ్రోజులబట్టీ జ్వరం. పైగా మీ కిలా అపరేషనయిందని పిల్లలెవరో ఊదేసినట్టున్నారు. ఒకటే ఏడుపు: గంటనుంచీ స్పృహకూడా లేదు."

"బాగుందే, పనిలో భగవతీ సాక్షాత్కారం పొందినవారికి ఈ ఐహిక బంధనాలు ఎలా అడ్డొస్తాయి? అంత ముసిల్ది యిన్నాళ్ళు బతకడమే చిత్రం కాదూ?"

భ్రమరాంబ భర్తవైపు చూసింది. ఏదో పురుగును చూసినట్టు చూసింది. అక్కణ్ణుంచి ఆదుర్దాగా అవ్వదగ్గరకు వెళ్ళిపోయింది. హనుమంతయ్య నెమ్మదిగా ఆమెను అనుసరించాడు. అవ్వ కన్నుమూసే ముందు కాస్త తెలివితెచ్చుకుంది. మనవడి బుగ్గలు ప్రేమతో తడిమింది. "బాగున్నావా, అమ్మా?" అంది. "కన్నతండ్రి ఒకడూ, కూడా పుట్టిన తమ్ముడు ఒకడూ ఇంకా నీ కిద్దరున్నారు ... మరిచిపోకమ్మా" అంది.

"ఏదీ నీచెయ్యి యిలా యియ్యమ్మా" అంది. తచ్చిపోయేదాకా ఆ చెయ్యిని అలా ఎగిరేగిరి పడుతూ. ఊర్ధ్వ ప్రయాణానికి ఉరకలు వేస్తున్న గుండెలమీద పెట్టుకుంది.


"ఎవరు తమ్ముడు? ఎవడు తండ్రి? ఏమి టింకా చచ్చేదాకా ఈ తాపత్రయం." అని మరోమారు విసుక్కున్నాడు హనుమంతయ్య. అయినా 'కర్మయోగి' అయిన అతనికి మరొక పదిహేను రోజులకి 'కర్తవ్య నిర్వహణ'లో తమ్ముడి ప్రసక్తి తప్పలేదు. ఆ రోజు స్టాఫ్ కాన్ఫరెన్సులో అతను చెప్పేడు:

"సోదరులారా! మనందరి ఉపాధ్యాయులదీ ఒక కుటుంబమని నేను వేరే చెప్పనక్కరలేదు. మన కుటుంబానికి చెందినవాడే మరొక ఆత్మీయుడు మన మధ్యకి వస్తున్నాడు. వచ్చిన పని వేరు కావొచ్చు. హోదాలో తేడా వుండొచ్చు. కాని ఆయన నాకు తమ్ముడి వరుస; అందులో ఎంతమాత్రం సందేహం లేదు."

అంతుచిక్కక ఉపాధ్యాయు లందరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఎదుటివాళ్ళను ఇబ్బందిలో పెట్టి తన ఆధిక్యత నిలబెట్టుకొనేలా మాటాడగలనని హనుమంతయ్యకు ఒక విధమైన గర్వం. అందుకనే ఆయన మెప్పు పొందుదామనుకున్న టీచర్లు ఆయన ముందు మాటల్లో ఓడిపోయినట్లు నటిస్తారు.

చిన్న పొడిదగ్గు ఒకటి వెలికి రానిచ్చి హనుమంతయ్య అందుకున్నాడు మళ్ళీ:

"పై ఆఫీసర్లంటే – ఇనస్పెక్టర్లంటే ఎంత గుండెదిటవు ఉన్నవారయినా కంగారు పడిపోతూంటారు. ఇనస్పెక్టరుకు వచ్చే డీయీవోని ఒక కుటుంబ వ్యక్తిగా ఆహ్వానించగల సాహసం ఎన్ని సంస్థలకు ఉందంటారు? మన పాఠశాల తణిఖీనిమిత్తం వచ్చే పరాంకుశంగారు ఎం.ఈడి. ఫస్టుక్లాసులో ప్యాసయినదిట్ట అయితే నేం, బుద్ధి పెద్దదిగాని వయసు స్వల్పం. అందుకే




తమ్ము డన్నాను. మీ యింటికి మీ తమ్ముడొచ్చి తలుపుతడితే ఏమిస్తారు."

నిజంగానే అప్పటికి అయిదారేళ్ళ క్రితం హనుమంతయ్య తమ్ముడు ఫణిభూషణం వాళ్ళింటికి వచ్చి తలుపు తట్టేడు.

"అన్నయ్యా, నాన్నగారి జబ్బు బాగా ఎక్కువైపోయింది. ఇంజక్షన్లకే నెలకి ఏభై మించి అయిపోతోంది. ఇక పళ్ళూ, టానిక్కులూ చెప్పేదేముంది? నూట్రూపాయల జీతంతో నే నొక్కణ్ణీ ఎంతకని ఎన్నాళ్ళని యీ బండి లాగను? నువ్వుకూడా నెలనెలా ఇంతని పంపిస్తేగాని..."

హనుమంతయ్య తమ్ముణ్ణి మధ్యలో అడ్డేశాడు.

"ఒరే ఫణీ, యింక చెప్పకు ... ఒకరు చెప్తే తలవంచి వినే దౌర్భాగ్యం తప్పిపోయి నాకు చాలా కాలమయింది. భగవంతుడి దయవల్ల నే నిప్పుడు చాలా పెద్ద పదవిలో ఉన్నాను. ఆర్థిక దుస్థితిలాంటి అల్పమైన విషయాలగురించి ఆలోచించడానికికూడా నాకిప్పుడు తీరుబడీలేదు. నాకు తెలిసినంతవరకు మన వంశంలో యింతటి ఉన్నతస్థానం అందుకున్నవాళ్ళు లేరు. ఎంతపదవి, ఎంతటి పరపతి! నన్నయినా యిలా అత్యున్నతస్థాయిలో బతకనిచ్చి హెడ్మాస్టరి బంధువులుగా గుర్తింపబడే మీ అదృష్టానికే సంతోషించండి. ఇలా తలమానికంగా నన్ను ఓ వెలుగు వెలగనియ్యండి. సాధారణమూ అశాశ్వతమూ అయిన సంసార కూపంలోకి మళ్ళీ నన్నెందుకు లాగుతారు చెప్పండి? నాన్నగారికే కాదు, నీకూ ఒక్క నమస్కారం. నన్నిలా బతకనియ్యండి."

ఫణిభూషణం అతి అసహ్యాకరమైన మొహంతో అన్నవైపు చూశాడు. చూస్తూ ఒక్కమాటమాత్రం అనేసి వెళ్ళిపోయాడు.

"నీ దగ్గిర చదువుకుంటున్న వాళ్ళూ, నీ సంస్థలో పనిచేస్తున్నవాళ్ళూ ఎంత దురదృష్టవంతులు!"

"మాటాడరేం. పండితుడైన మీ తమ్ముడు రాకరాక మీ యింటికి వచ్చి తలుపు తడితే ఏమిస్తారు?... ఊరికే అన్నాను... నిజానికి మనం ఏమివ్వగలం? ఏమిస్తే అధికారుల ఋణం తీరుతుంది!"

తీరదు. పై అధికారుల రుణం అంత సుళువుగా తీరదు. అందుకనే హనుమంతయ్య అన్ని ప్రయత్నాలు చెయ్యవలసి వచ్చింది. ఇంట్లోనుంచి వెన్నకాచిన నెయ్యి,

దగ్గిరుండి పితికించిన గేదిపాలు. సన్న సూదుల్లాంటి బియ్యం, అప్పుడు కోసిన కూరగాయలు, తమలపాకులు, కొత్తపల్లి కొబ్బరి మామిడిపళ్లు...ఏదో చంద్రుడికో నూలుపోగు— అంతకంటె ఎవ రేం చెయ్యగలరు? ఆ ఊళ్లో మంచి ఫర్నిచరు షాపులున్నాయని డబుల్‌కాటు పురమాయించినా, మంచి నేతబట్టలు దొరుకుతాయని ఓ నాలుగు తానులు కావాలన్నా...ఎవరు ఎమైనా పైవాడా, తమ్ముడుగారు! నెత్తిమీదచుట్టం! వారాల తరబడి స్కూలు వర్కు నాశనమైనా, ఇంతింత పిల్లలకు కృత్రిమ ప్రదర్శనే జీవిత లక్ష్యమనే నీతి బోధించబడినా. అధికారుల హావభావాలకే సంస్థలకి సంస్థలే అమ్ముడుపోయినా ఎవరికి నష్టం? ప్రజాక్షేమంకన్న పార్టీయే ముఖ్యమని భావించే నాయకు లున్నంతకాలం ఏంచేస్తే చెల్లదు!

*    *    *

ముసలిఅవ్వ చచ్చేముందు పనికిరాని హితబోధ చేసి మరీ కన్ను మూసింది. తమ్ముడొకదేకాదు; తండ్రినీ అప్పజెప్పింది. హనుమంతయ్య దృష్టిలో తండ్రి పదానికి అర్థంకూడా బాగా విస్తృతమైనది. మన మందరము దేవుని బిడ్డలము. దేవుడొక్కడే జగత్పిత. ఆయనకాక వేరు తండ్రెవరు! నిజానికి హనుమంతయ్యా పని చేస్తున్న హయర్ సెకండరీ హైస్కూలు ఒక దేవాలయ ఆదాయం మీదే పని చేస్తున్నది. ఆదిభిక్షుకుడైన దేవుడికి చేసేంత ధర్మం ప్రజలు మ రెవరికీ చెయ్యరు. ఎండల్లో మండిపోయినా, వరదల్లో కొట్టుకుపోయినా మామూలు మనుషులసంగతి ఎవరికీ పట్టదు. పాపం ఏ రాముడో, హనుమంతుడో, సాయిబాబావో ఏ చెట్టుకిందో దిక్కులేకుండా అయిపోయాడని విరాళాలు వసూలుచేసి రాతిదేముడి కొరక రాతికొంప కట్టిస్తారు. రాతి హృదయంకల మనుషులు అంతకన్న ఏం చెయ్యగలరు? కొందరు గడుసరులైన భక్తుల ఉదరనిమిత్తం వెలసి—బ్రహ్మాండంగా పైకివచ్చిన ఒక దేవుడి మేనేజిమెంటుకింద ఆ పవిత్రమైన పాఠశాల నడుస్తోంది. అయిదుకొండలపైన వెలసిన దేవుడి ఆధ్వర్యంలోఉన్న పాఠశాలకి కనీసం మూడు అంతస్థులైనా ఉండొద్దా?

హనుమంతయ్యగారు ఆ చల్లని తండ్రిని మనసా నమ్ముకున్నాడు. తన రూంలోకి వచ్చి కిటికీరెక్క తెరిస్తే కొంచెం దూరంగా కనిపించే ఆ కొండల ఆకృతికి మొదట మొకరిల్లనిదే ఏ పనీ మొదలెట్టడు. భగవంతు డొక్కడే మనిషిగానూ, మనుషులందరూ క్రిమికీటకాలుగానూ అయన కంటికి కనిపిస్తారు.

అయితే హెడ్మాస్టరుగారు నిత్యం కొలిచే మానవోత్తముడుకూడా ఒకడు లేకపోలేదు. ఆ ప్రైవేటుస్కూలు మేనేజిమెంటు అంతటికీ పెద్ద — దేవాలయం తాలూకు ఎక్జిక్యూటివ్ ఆఫీసరు వ్యాఘ్రేశ్వర్రావు నాయుడు గారు. ఈ ఆఫీసరుగారు ఒక పెద్ద బంగళాలో నివసిస్తారు. ఒక చిరు చక్రవర్తి హోదా మెయిన్‌టెయిన్ చేస్తారు. దేవుణ్ణి చూడానికి క్యూలో ఒక గంట నిలబడవలసి వస్తే వ్యాఘ్రేశ్వర్రావుగారి దర్శనం అవడానికి కనీసం రెండుగంటలు పడుతుంది. అలా అని ఆయన మిమ్మల్ని అవమానించారు అనుకునేరు సుమా! బంగళా గేటుకి కుడివైపున పెద్ద పెద్ద పాలరాతి కుర్చీ లుంటాయి. తిరిగి కబురు వచ్చేదాకా అలా వాటిమీద ఎంతసేపైనా 'తగలడ' వచ్చు. మనకి ఎడంచేతివైపున ఫుల్‌కాకీ యూనిఫారంలో ఒక నౌకరీ వెధవ ఏడుస్తూ ఉంటారనుకోండి. అయితే మనకీ వాడికీ పోలి కేమిటి, అర్థంలేనిమాట? అయినా వాడంతటిఉద్యోగి వాడు. వాడిజేబులో చిన్న టైంపీసూ, చిన్న లాగ్‌బుక్కూ, పెనసలూ ఉంటాయని మొట్టమొదట సూక్ష్మదృష్టితో కనిపెట్టినవాడు హనుమంతయ్యగారు. ఎవరు ఎంతసేపు అక్కడ వేచివున్నారో వాడు నోట్‌చేస్తున్నాడని గుర్తించినదీ ఆయనే. పాఠశాలలో ఉద్యోగనిర్వహణకి అక్కడ 'అఘోరించడమే' గీటురాయి అని తెలుసుకున్నదీ ఆయనే. అందుకనే సూర్యుడు ఉదయించడమేనా మరచిపోవచ్చుగాని ఆయన ప్రతిరోజూ నాయుడు గార్ని దర్శనం చేసుకోడం మరచిపోరు. 'మనల్ని కన్నతండ్రి లాంటివారు... కనిపెట్టి చూసేవారు — ఆయన దర్శనభాగ్యం లభించని, ఆయనతో రోజుకి ఒకమారేనా మనవిచేసుకోని బతుకెందుకు? ఈ సత్సంప్రదాయం యివాళ నువ్వూ నేనూ పెట్టినదా? హుజూరువార్నే అనుకోడందేనికి? ఏ గవర్నమెంటు ఆఫీసుకి వెడితేమాత్రం వెంటనే పై ఆఫీసరు దర్శనం అవుతుందిగనుకా? ఆ బ్రిటిషువాడు స్వార్థపరుడు గనక వెంటవెంటనే పనులైపోవాలని ఉరెట్టుకు చచ్చేవాడు. మనవాళ్ళు నిదానస్థులు. ఒకడు చేసేపని చక్కగా పదిమందీ వంతులు చేసుకున్నారు. ఆదయినా ఒకపట్టాన తెమల్చకపోడం నేర్చుకున్నారు. నసగడం, నాన్చడం...నాలుగుసార్లు తిప్పడం... పైవారి దర్శనం అంటే మాటలా? ఎన్ని తెరలు, ఎంతటితంతు! అంతటి అధికారాన్ని అర్థంచేసుకోడం సామాన్యులకి సాధ్యమా? నేనూ ఒక పదవిని నిర్వహిస్తున్నాను కనక అందులో కష్టనిష్ఠురాలు నాకు తెలుసు. గాడిద కేం తెలుసు గంధపుచెక్కల వాసన? ఆశ్రయించడం అనేది యివ్వడం ఎవరికి తెలుసో పొందడమూ వారికే తెలుసు. అయినా తండ్రిని చూడ్డానికి బిడ్డ వెళ్ళడం అదో మహాపరాధంటండీ?" అంటాడు హనుమంతయ్యగారు.

మహాపరాధమే అయి ఉండొచ్చు. అందుకనే ఫణిభూషణం "నాన్నగారికి వారం రోజుల్నుంచీ సీరియస్‌గా ఉంది. నువ్వెలాంటివాడవయినా ఆయన పెద్ద కొడుకువి; నిన్ను చూడాలని ఒక్కలా కలవరిస్తున్నారు. 'అధికార రోగపూరిత బధిరాంధక శవము'వి కాకపోతే ఒక్కసారి వెంటనే చూసివెళ్ళు. నీ డబ్బెం అక్కర్లేదు. ఒక్కసారి రా" అని రాసినా హమనుంతయ్యగారు ఉత్తరం వెంటనే




చింపేశారు. తండ్రిని చూడ్డానికి బిడ్డ వెళ్ళనే లేదు. 'ఇలాంటి సర్వసాధారణ విషయాలు చూడ్డానికి నాకు తీరి కెక్కడ ఉండిచచ్చింది. ఒకసారి చెబితే అర్థం చేసుకు చావరు. దిక్కుమాలిన లోకం!' అని విసుక్కున్నాడు. ఆ విషయం ఇహ రెండోసారి ఆలోచించనేలేదు.

* * *

"ఎప్పుడూ శుద్ధ ఖద్దరు ధరిస్తారు... ఇరవైనాలు గ్గంటలూ స్కూలు స్కూలో అని పడిచస్తారు ఎంతటి పరిశుద్ధాత్ములు" అని కొత్తగా చేరినవారెవరైనా హెడ్మాస్టరు గారి గురించి అంటే పాతవాళ్ళు ఆ మాట పడనివ్వరు.

"కుషన్ కుర్చీలో ప్యానుకింద కూచోబెట్టి నెల అయేసరికి అయిదువందలు కళ్ళ చూపిస్తే పరిశుద్ధాత్ములు కానివారెవరు? ఎలాలేదన్నా పెరటిదారిన మరో అయిదు వందలు ఇల్లు చేరుతాయి. అక్కడ కూచుని నేనూ ఈయనా పడే పాటేమిటంట! గుర్రుమనడం, గుడ్లురమడం, గుక్కతిప్పకుండా గొణుక్కోడం. ఇంతేగా! ఈ దాష్టీకపు పంతులాంగం ఎవరెరుగరనీ? రెండు జేబులూ నిండుగా వుంటే రెండు కళ్ళూ మిలమిల మెరవకేం చేస్తాయి!"

కేవలం డబ్బుకోసమే హనుమంతయ్య పడిచస్తున్నాడనేది. దూరంనుంచి ఆయన్ని అంచనా వేసేవారు. అనుకోవలసిన మాటగాని. ఆయన కొడుకులూ, భార్యా ఒక్కనాటికి ఒప్పుకోరు. స్వతహా లేనివాడు కావొచ్చుగాని కూతుళ్ళు లేరుగనుక ఆయనకి అప్పులబాధ లేదు. కొడుకులు నలుగురూ బాగా పైకొచ్చారు. పెద్దపెద్ద కట్నాలతో యిద్దరుకోడళ్ళు వచ్చారు. సాధారణపు కోడళ్ళుకారు – నెల కొకసారి బంగారపు గుడ్లు పెట్టే కోళ్ళు. అనగా ఉద్యోగాలు చేస్తున్నవారు. పెళ్ళిళ్ళుకాని చిన్నకొడుకు లిద్దరికీ కూడా యీ మధ్య పనులయినాయి. అంతా అంతో యింతో యింటికి పంపిస్తారు. పోనీ ప్రత్యేకించి కాణీదగ్గర్నుంచీ నిలవ చేసే లక్షణ మేమైనా ఉన్నదా అంటే అటువంటి ధనదాహమూ హనుమంతయ్య దగ్గిర కనబడదు; మరి?

చిన్నకొడుకు లిద్దరూ శెలవలికి వచ్చినప్పుడు భ్రమరాంబ మొరపెట్టుకుంది.

"బాబూ...మీ నాన్నసంగతి రోజు రోజుకీ మరింత అయోమయంగా తయారవుతున్నదిరా...ఈ సెప్టెంబరుకి అరవై కూడా నిండుతాయి. ఇంకా ఆయన మనసు ఉరకలు వేస్తున్నదట. మొన్న ఎవరితోనో చెబుతూంటే విన్నాను ఇంక ఆస్కూలు పిచ్చికి అంతూపంతూలేదు. ఒకొక్కరోజు మధ్యాన్నం యింటికి రావడంకూడా మానేస్తున్నారు, పీకపోయినా శెలవు పెట్టరు గదా... ఒకొక్కరోజు ఆహడావిడి చూస్తూంటే నాకు భయమేస్తోంది. మనసుతోపాటు శరీరం పరిగెత్త లేదుగదా–రిటైరయిపోయి రెస్టు తీసుకోమని

నేను పోరనిరోజు లేదు. ఈమధ్య ఓసారి యిలా గట్టిగా నిలదీశావనే వారం రోజుల్నుంచీ నాతో మాట్లాడ్డం మానేశారు. మనం ఎవరమూ ఆయనకంటె పెద్దవాళ్ళం కాకపోతిమి; ఎలా చెప్పాలో ఏమిటో నాకు మా చెడ ఆందోళనకరంగా ఉందిరాబాబూ... ఇన్నాళ్ళూ అయితే ఫరవాలేదు. ఈమధ్య ఇప్పుడి లేచి దగ్గర్నుంచీ ఒక్కవాడూ గుప్పెడన్నం తిన్నపాపాన పోలేదు..."

రెండ్రోజులు తీవ్రంగా ఆలోచించారు. మూడోనాడు అన్నదమ్ములిద్దరూ వ్యాఘేశ్వర్రావునాయుడుగారిని కలుసుకున్నారు.

"మీ సంస్థ మీకు ముఖ్యమే. కాదనలేం. కాలమానాన్న ఆరోగ్యం మీకు మరింత ముఖ్యమన్నది మీరు కాదనలేరుకదా! ఒళ్ళు తెలియకుండా వస్తున్నాడని యింకా ఎంత కాలం ఆయనచేత చాకిరీ చేయించుకుంటారు? ఇది మీకు ధర్మమా?"

నాయుడుగారు కుర్రాళ్ళని పూర్తిగా మాటాడనిచ్చాడు. ఫ్యూన్‌ని పిలిచి ఒక ఫైలు తెప్పించాడు. అది వాళ్ళ చేతిలో పెట్టేడు.

"ఇంత ఎత్తున ఉన్న యీ కాయితాలన్నీ మీ నాన్నగారు తమ ఉద్యోగకాలం పొడిగించమని మేనేజిమెంటుకు పెట్టుకున్న దరఖాస్తులు. రూల్సు ప్రకారం ఏభై అయిదు వయస్సు మించి మేం ఉద్యోగాల్లో ఉంచం. కట్టుదిట్టమైన ఆయన కార్యనిర్వహణే కాక, కడుపు కరిగేలాగ ఆయన స్వయంగా చేసుకున్న విజ్ఞాపనలూ, కనికరం కలిగించేలాగ ఆయన పెట్టుకున్న అర్జీలూ యిన్నాళ్లూ ఆయన ఉద్యోగపరిమితిని పెంచడానికి కారణమయ్యాయి ఒకసారి ఆకాగితాలుచూడండి."

శ్రీశ్రీశ్రీ దొరవారి దివ్య సముఖమునకు తమ ముఖ్య సేవకుడు చేయు విన్నపములు – ప్రభువుల పాదసన్నిధికి భృత్యుని విజ్ఞాపనలు – ఇలా ఉన్నాయి ఆ లేఖలు. అన్నదమ్ములిద్దరూ ఒకర్ని ఒకరు చూసుకున్నారు. సూటిగా నాయుడిగారి వైపు చూడలేకపోయారు అతిచక్కని ఆ నిశ్శబ్దం రెప్పలూ నొసలూ ఎగురేస్తూ కొంతసేపు ఎంజాయ్ చేసి నాయుడుగారు ఫ్యూన్‌చేత మరొక ఫైలు తెప్పించాడు.

"చూడండి యీ ఫైలు; మీ నాన్నగారి ఫైలు పక్కని పెడుతున్నాను. కనీసం రెట్టింపయినా ఎత్తు ఉంటుందికదూ? ఆయన ఆథార్టీ భరించలేక పోతున్నామనీ, వెంటనే తీసెయ్యమనీ వచ్చిన ఆ సంతకంగాళ్ళ పిటీషన్లు...'ఇది మీకు ధర్మమా?' అని ఎవరూ అడగని ప్రశ్న ఈనాటికి నన్ను మీరు వేశారు. ఇదే మీకు ధర్మమా? అని నేనడుగుతున్నాను. ఇప్పుడు జవాబు చెప్పండి."

చిన్నవాడు కోపంతో ఇవతలి కొచ్చేశాడు. పెద్దవాడు అతన్నే అనుసరించి వచ్చేస్తూ ఒకమాట అన్నాడు:

"క్షమించండి. మొదట్నుంచీ పై ఊళ్ళలో చదువుకున్నాం. ఇక్కడ రాజకీయాలు మాకు తెలియవు. కానీ, పదవిలోకి వస్తే పరమ నిరంకుశు దవుతా డన్నది విజాతీయమైన పలుకుబడి. అది మా నాన్న పట్ల నిజమైనదని గుర్తించి మేము సిగ్గుపడుతున్నాం. కాని ఒకటిమాత్రం గుర్తుంచుకోండి. వెర్రితలలు వేస్తున్న యీ వ్యవస్థలో మీకూకూడా తక్కువ బాధ్యతేం లేదు. శలవు."

మొదట్నుంచీ హనుమంతయ్యగారి దగ్గర పిల్లలెవరికీ తగినంత చనువులేదు. వయసు తేడావల్ల ఆఖరివాళ్ళకి అసలులేదు. అదిగాక ఆయన పిల్లల్నెప్పుడూ మంచి కంపెనీగా భావించి సరదాగా గడిపింది లేదు. వాళ్ళకు జరిగిన చదువులు, పెళ్ళిళ్ళు అన్నీ 'బిజినెస్ లైక్'గా జరిగినవే. తల్లి దండ్రులిద్దరి బాధ్యతా భ్రమరాంబే వహించేది. ఉన్నన్నాళ్ళు అవ్వగారుకూడా ఆత్మీయత అనేది లోపించకుండా పిల్లల్ని నర్దుకు వచ్చేది.

అవమానంతోనూ, కోపంతోనూ యిల్లు చేరుకుని తల్లిముందు అన్నీ వెళ్ళగక్కుకున్నారుగాని కుర్రాళ్ళిద్దరూ తండ్రి వచ్చేసరికి కిక్కురు మనలేకపోయారు. భ్రమరాంబగారే నెమ్మదిగా, మొదలెట్టింది:

"ఇదిగో...వింటున్నారా మీ కొడుకు లిద్దరూ ఏమంటున్నారో ... వాళ్ళ నాన్నగారు ఉద్యోగంచేస్తే యింక ఒప్పుకోరుట...నాతో కాదు అడ్డుపవాళ్లు వెయ్యడానికి ... మీ హక్కుదారులు వాళ్లు. ఏం జవాబు చెప్పుకుంటారో చెప్పుకోండి."

"పాపం నీ కెందు కంత శ్రమ? దమ్ముంటే ఆ కుర్రసన్నాసుల్నే యివతలికి రమ్మను."

భ్రమరాంబ మోచేత్తో చిన్నివాణ్ని పొడిచింది చిన్నవాడు పెద్దవాణ్ని ముందుకు తోశాడు. వాడు గొంతుక సవరించుకుని ఎలాగైతే నేం మొదలెట్టాడు.

"అది కాదండీ...నాన్నగారండీ... ఎవరూ, ఆ వ్యాఘ్రంగాడు లేడూ – ఇవాళ్ళ అర్థమయిన కూతలూ మిమ్మల్ని కూశాడండీ. వాడి కాళ్ళు యింకా యింకా పట్టుకోవలసిన ఖర్మ మీకేమిటండీ?"

హనుమంతయ్య పెద్దగా నవ్వేడు.

"ఓహో అదా? ఓరి వెర్రినాన్నల్లారా, ఇది ప్రపంచం అనే సంగతి ఎప్పుడూ మరచిపోకండి. ఒకరి కాళ్ళు పట్టుకోందే ఎప్పుడూ ఎవరికీ జరగదు. అయినా పట్టుకోడానికి కాకపోతే కాళ్ళకీ చేతులకీ సార్థకత ఏముంది? ఒక జతకాళ్ళు పట్టుకున్న నా దురదృష్టానికే విచారిస్తున్నారే; పొద్దుటలేచి ఎనిమిదివందలమందిచేత కాళ్ళు పట్టించుకున్న నా అదృష్టం గురించి ఆలోచించారూ? ఏమే వెనక నాటకాల నాయకురాలా, పిల్లల్ని కాదు పురెక్కించి పంపడానికి, ఎదురుబడి అడుగుతున్నాను ఏం జవాబు చెబుతావో చెప్పుకో.''

భ్రమరాంబ వీలయినంత చప్పుడయేలా తలుపు వేసేసి లోపల గడియ పెట్టేసింది. తల్లీపిల్లలు పావుగంటసేపు గుడగుడలాడుకున్నారు.

"అమ్మా రేపు తెల్లారి పాసెంజర్లో నువ్వు మాతో వచ్చెయ్యి. దగ్గిరుండి ఏవేళ

కేదికావాలో అమతున్నకొద్దీ యీయనకి నీవిలువ తెలియడం లేదు..."

"విన్నాను – మీ మంత్రాంగం ప్రతి అక్షరం నా చెవిని పడింది. ఇప్పుడే వస్తామండండి... కొన్ని ఏర్పాట్లున్నాయి. హనుమంతయ్యగారు ఆ రాత్రివేళ ఏడున్నరకి వెళ్ళి పదింటికి తిరిగి వచ్చారు.

"స్కూల్నించి యింటికి అటూయిటూ తిరగలేక ప్రాణాలుపోతున్నాయి." కుర్రాళ్ళు ఎంత సులువుగా ఈ సమస్య పరిష్కరించి పారేశారు! ఎంతయినా సూక్ష్మ బుద్ధులు మీవి! సరస్వతీ పీఠమే సర్వస్వం అనుకున్న నాలాంటి వాడికి యింకా యిల్లూ, ఇల్లాలూ అంటూ ఈ భ్రమలు దేనికి? ఎలాగా స్కూల్లో సకలసదుపాయాలతో నాకు ఒకగది ఉండనేఉన్నది! పక్కనున్న సేఫ్టీలెట్రీనూ, బాత్‌రూమూ వచ్చేపోయే పెద్దమనుషుల సదుపాయం కోసం నేను బెత్తాయించి కట్టించినవి సరేసరికదా! ఇప్పుడే వెళ్ళి ఆ తెర చాటున ఓ మడతమంచమూ, బీరువా వెనక నా పరుపుచుట్టా, సూట్‌కేసూ, కేరియరూ పెట్టించి వచ్చేశాను. ఒంటిగాణ్ణి యింక నా కేంకావాలి! తెల్లవారుఝాము పాసెంజరు దాకా ఎందుకు, యిప్పుడు పదకొండున్నరకి ఎక్స్‌ప్రెస్ ఉంది. వెంటనే వెడితే అందకపోదు!"

చిన్నకొడుకు లిద్దరూ కలసి అప్పటికప్పుడు తల్లిని ప్రయాణం చేయించారు. వెళ్ళిపోతూ భ్రమరాంబ అంది:

"ఇదిగో, ఆరోగ్యం జాగర్తగా చూసుకోండి... మళ్ళీ తొందర్లోనే వచ్చేస్తాములెండి."

"అంత తొందరేం లేదులే" అన్నాడు హనుమంతయ్య అటుతిరిగి.

"ఇంకెన్నాళ్లో లేదు" అన్నాడు గుర్రబ్బండెక్కుతూ చిన్నాడు. "అదేమిటి!" అని ఎవరూ అడగలేదు: భయం భయంగా ఎవరికి తోచిన జవాబు వాళ్ళు చెప్పుకున్నారు.

* * *




అన్నీ వదులుకున్నామని అనుకున్న వారికి అన్నిటికీ సరిపడే ఒకటి ఉండనే ఉంటుంది. లేకపోతే న్యూటన్ సిద్ధాంతం ఏం కావాలి? హనుమంతయ్యగారు బస మేడమీదకి మార్చిన తర్వాత ఆయనకి "కాల్చుకుతినడం"మీద మోజు రోజురోజుకీ ఏలా ఎక్కువైపోయిందో తెలుసుకోవాలంటే ఆయన చాటున ఆయన అసిస్టెంట్లు చేసే రిమార్కులు అప్పుడప్పుడయినా రికార్డు చెయ్యాలి. "పదింటినుంచి నాలుగున్నరదాకానే కదూ స్కూలూ, అయిదున్నర అయినట్టుంది యింకా యిక్కడేం చేస్తున్నావ్?"

"పదింటినుంచి నాలుగున్నరదాకా అనే మాట విద్యార్థులకే వర్తిస్తుందిట, ఉపాధ్యాయులకి కాదుట!"

"ఇది ఎవరి నిర్వచనం?"

"ఇంకెవడికి, ఇంటికంటె గుడి పదిలం అని అమ్మగారిమీద అలిగి స్కూలు చేరిన హనుమంతయ్య గాడిద గాడిది! మామగారి యిల్లయిన పాలసముద్రంమీదే బిచాణా పరిచిన విష్ణుమూర్తిలా ఉండి ఆయనిపని. ఆయన కేం!"

"అయినా రోజూ యింతమందికి స్కూలయిపోయింతరవాత పనేముంటుంది?"

"అధికారం చెలాయించడంలోనే బ్రహ్మానందానుభవం పొందగల బుద్ధిమంతులు – ఎదటివాడు ఊరికే కూచుంటే చూడలేక – అప్పటికప్పుడు ఏదయినా సృష్టించగలరు! బడి విడిచిపెట్టగానే పిల్లలతోపాటు మేమూ పారిపోతే సుఖపడిపోమూ? అదిగాక యింటికి చేరీచేరగానే ఎవరిమటుకు వాళ్ళం ట్యూషన్ స్కూళ్ళని పెట్టుకుని వేలకివేలు గింపుకుంటున్నామని మా రావణబ్రహ్మకి మంట."

"మీలో ఐక్యతలేదా! గట్టిగా అడిగేవాడు లేడా?"

"ఏం చెయ్యమన్నావ్. దేశంలో పాలకవర్గానికి ఎంతటి ఆరోగ్యకరమైన అపోజిషన్ ఉందో యిక్కడా అంతే అందులో యీయన మా లక్ష్యం. ఆశ్రయింపు మా జీవం. జావిసత్వం మా చిహ్నం. పుట్టిన ప్రతిక్షణంనుంచీ చావు మొదలయిందని ఏ క్షణమూ మరచిపోనంత ధైర్యంగల వాళ్ళం మేము 'ఆ భగవంతుడి దయవల యింకా ఈమాత్రంగానైనా ఉన్నాం' అని సంతోషిస్తూ ఉంటాముకూడా..."

"నీ మాటలు వింటూంటే నాకు మీ కీచకుడు చేస్తున్నదే రైటనిపిస్తోంది."

"ఎవరు కాదన్నారు? పేరుకి మాత్రమే ఉన్న ప్రజాస్వామ్యంలో సామాన్యుడు అలా

ఎలా అనుకోగలడు? అనుకుని తన భార్యా బిడ్డల్ని ఎలా పోషించగలడు? తిండికోసం మధ్యతరగతివాడు ఎంత నీచానికైనా వెనుదీయడు. అందర్నీ అదృష్టం అందలం ఎక్కించదుగదా!"

"వస్తా. పనుంది. మావాడు మొన్న పరీక్షల్లో లెక్కల్లో పాడుచేశాడట. ముందుగా ఆ మహిషాసురుడి మూతి కడితే గాని..."

* * *

హనుమంతయ్యకు తలతిరిగినట్టయింది. కాఫీ మరో గ్లాసుడు తాగేడు. కళ్ళజోడు మరోమారు తుడుచుకున్నాడు... ఫేను మరింత స్పీడుగా పెట్టేడు. వచ్చిన ఉత్తరవు మరోసారి చూశాడు. చేతులు వణికేయి. గుండె ఆగిపోయిందా అనిపించింది. వచ్చే అక్టోబరు ఫస్టునాటికి ఆయన హెడ్మాస్టరీ అంతమవుతుంది!

అంతపెద్ద సంస్థని నిర్వహిస్తున్నవాడికి ఆ మాత్రం జ్ఞానంలేదా. ఎల్లకాలం రిటైరయిపోకుండా శాశ్వత బ్రహ్మకల్పంగా హెడ్మాస్టరుగిరిలో ఉండిపోతా ననుకునేంత మూర్ఖుడా? అంతగా షాక్ తినడానికి అదేమంత ఎదురు చూడని వార్తా అని ఎవరైనా సహజంగా ఆశ్చర్యపోవచ్చు. వెర్రితలలు వేస్తున్న మానవ స్వభావాన్ని ప్రతినిత్యం చూస్తూ అదేజాతికి చెందినవారు ఆశ్చర్యపోవడమే నిజంగా ఆశ్చర్యకరమైన విషయం. ఆయుర్దాయం, ఐశ్వర్యం. పదనీ వ్యామోహం యిలాంటివాటిలో 'చాలు' అనేవాడు పసివాడయినా అయి ఉండాలి. పిచ్చివాడయినా అయివుండాలి. 'ఒక్క మంత్రిపదవికేనా ఏమిటి గరిష్టవయో పరిమితి లేనిది? దేవుడి పేర్న నడిచే ప్రత్యేక విద్యాలయం. దీనికి మామూలు రూల్సు పాటించాలనే రూలు ఎక్కడుంది? సరిగ్గా అజమాయిషీ చేస్తున్నాడా లేడా అనేది లెక్కగాని వయస్సుతో పనేముంది? కనీసం మరో పదిహేనేళ్ళపాటు నాకిక్కడ ఢోకా ఉండదు' అని హనుమంతయ్యగారు అంచచా వేసుకున్నారంటే అందులో తప్పేముంది? ఆ గిరీలో ప్రవేశించిన మొదలు ప్రతిక్షణం ఆయన తన పదవికి మరింత పటిష్ఠం చెయ్యడానికి ప్రయత్నిస్తూనే వచ్చాడు. వలసిన కీలకస్థానాలన్నిటినీ పడుతూనే ఉన్నాడు. చిన్న చిన్న బలులు సైతం యిస్తూనే ఉన్నాడు. ఆఖరికి అమ్మవారు అర్చకుణ్ణే మింగిందా?

హనుమంతయ్య మరొకమారు ఆర్డరు చూశాడు. ఏమాత్రమూ తేడాలేదు: తను పదిరోజులుగా చేసున్న ప్రయత్నంకూడా నాశనమయింది. కొత్త హెడ్మాస్టరుగా వచ్చి జాయిన్ కమ్మని కుక్కుటేశ్వరస్వామికి ఆర్డర్సుకూడా వెళ్ళేయి.

ఆ తరవాత దసరా శలవలు వచ్చాయి. పొద్దుటిపూట ఆపీసు ఒక గంట పనిచెయ్యడం. పేపర్లు దిద్దేవాళ్ళు అప్పుడప్పుడు రావడం తప్ప-స్కూలు నిశ్శబ్దంగా ఉంది. అసలు ఆ శలవలకి సరిపడే పని హెడ్మాస్టరుగారు చెప్పలేదని మేష్టర్లందరూ చెవులు కొరుక్కున్నారు. ఆ పదిహేను రోజులూ, ప్రతిగంటా ప్రతి నిమిషం హనుమంతయ్య అనుభవించిన మానసిక సంక్షోభ ఆ గదికీ ఆ వరండాకీ ఆ స్ధంభాలకీ మాత్రమే తెలుసు! ఆ తియతియ్యని జ్ఞాపకాలు ఎలా, ఎలా మరిచిపోడం?

ఆ వరండాలోనే నిలబడి ఒకసారి హనుమంతయ్య కిందకి చూస్తున్నాడు గేట్లోంచి హడావిడిగా వస్తున్న లెక్కల మేష్టరు పుండరీకాక్షుడు కనిపించాడు. ఆ కంగారు చూసి తనకి నవ్వాగలేదు. వాచీ చూశాడు; పది నిముషాల లేటు. వాణ్ణిలా యీడ్చుకురా అని తలుపులయ్యను పంపించాడు. అతను వచ్చేసరికి హనుమంతయ్య 'పదవినలంకరించి కాలుమీద కాలేసి ఆడిస్తున్నాడు పుండరీకాక్షుడు ఒణికిపోతున్నాడు. నిలబడే ఉన్నాడు తను వాణ్ణి కూచోమన లేదు. అనకూడదు ఎక్కడివాళ్ళని అక్కడే ఉంచాలి ఇంకా వాడు అదృష్టవంతుడు. ఎంతోసేపు పైన వెయిట్ చెయ్యకుండా ఇంత సుళువుగా హెడ్మాస్టారి రూమ్ లోకి ప్రవేశం దొరికి, ఆయన దర్శనం అవడం అదెంతకాదు! "ఏంరా వెధవా, అక్కడ పైలు ఇక్కడ పెట్టేవ్" అని తలుపులయ్య మీద ఇల్లెగిరిపోయినట్టు కేకలేశాడు. ఆ కోపం చూసి లెక్కల మేష్టారి పెదవులెండిపోయాయి...

"ఎందుకొచ్చారు. ఏం మాట్లాడరేం?" మృగరాజు గర్జన. వాడి బెదురు చూసి తనకెంత ఆనందం కలిగిందనీ!

"మిమ్మల్నే. నా కోసమేనా మీరు వచ్చింది?" పిడుగుపాటు.

"చి-చిత్తమ్......తమరేమో వచ్చి. తలుపులు..."

"నే నొచ్చి తలుపులు తీస్తే మీరు దయతో వచ్చారనా?"

"కాద్ కాదు... తమరి సెలవయిందని తలుపులయ్య వచ్చి చెబితే..."

"అయితే మీమటుకు మీకు రావాలని బుద్ధిపుట్టలేదన్నమాట... మీ తప్పేమీలేదు, అంతా నాదే తప్పన్నమాట. సరే ఏం చేస్తాం? ఏం శిక్ష విధిస్తారో విధించండి.''

మాటల్లో మండీలు వేసి. అవతలివాడు కుడితిలో పడ్డ ఈగలాగ కొట్టుకుపోతుంటే చూసి ఆనందించడం అది ఎంతమంది సౌభాగ్యం!

"ఏమండీ, మాటాడరేం?"

"చిత్తం తమరలా శలవిస్తే నేనేం చెప్పగలను?"

"పోనీ, తమరే శలవియ్యకూడదూ ఏం శలవిస్తారోను... పోనీ వినయినా నేర్చుకుంటాను."

పుండరీకాక్షుడికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

"కొంచెం ఆలశ్యమైంది. మా ఆడవాళ్ళు సమయానికి యింట్లోకి రాకపోతే నేనే కాల్చుకోవలసి వచ్చింది."

"బాగుంది. ఎందుకాలస్యమయిందో సంజాయిషీ చెప్పుకోమని నేను ఆర్డరు పంపిస్తాను. మవ్విప్పుడన్న ముక్కలు

ఇంగ్లీషులో రాసేసి సంతకం చేసేసి నువ్వు క్లాసుకు వెళ్ళొచ్చు."

లెక్కల మేష్టరికి ఇక ఆ ఆపద గట్టెక్కి అవతల పడగలననే నమ్మకం క్రమక్రమంగా సడలిపోసాగింది.

"ఇంకా చిన్నవాడివి. మొదట్లో చిన్న చిన్న పొరపాట్లే సరియైన సమయంలో సర్దుకోకపోతే మహాపరాధాలై పీక పట్టుకుంటాయి. వెనకటికి ఒక రాజుగారూ, దివానూ ఉండేవారుట. ఇద్దరూ ఎక్కడికో బయల్దేరారుట. దివాను ముందు నడుస్తూంటే రాజు వెనకనుంచి అన్నాడు 'ఏం దివానూ, అంతలా కళ్ళుమూసుకుపోయి ముందు నడుస్తున్నావేం. వెనక్కి రావడానికి మేమేం నీ పరివారం అనుకున్నావా?' దివాను నాలుక కరుచుకుని రాజుగారు ముందు నడవగా తను అనుసరించడం ప్రారంభించాడుట. 'ఇది మరీ బాగుందయ్యోయి దివానూ ... ముందు వెళ్ళి మేం దారి చూపించాలన్నమాట; తమరు వెనక నిక్కుతూ నీలుగుతూ వస్తారన్న మాట.' దివాను లెంపలేసుకుని రాజుగారి పక్కగా ఆయనతో నడవబొయ్యాడు.

'ఏం పొగరుగావుంది దివానూ యివాళ నీకూ? అక్కడికి మనిద్దరం సమానస్థుల మనా నీఊహ?' అన్నాడురాజు. 'బాబూ ఈ రాజసేవ నావల్లకాదు. శలవిప్పించండి,' అన్నాట్ట. ఇదెందుకు చెప్పేనూఅంటే పెద్ద వాళ్ళతో నౌఖరీఅంటే కత్తిమీద సాము అన్నమాట. వెర్రి దివాన్లా శలవుతీసుకోడానికి రాలేదు. అవునా?"

"చిత్తం."

హనుమంతయ్య వాచీ చూశాడు.

"చూశావా...నువ్వు వచ్చిందేమో పది నిమిషాల లేటే. కాని అనవసరంగా గంట వేస్తు. దీనికి కారకు లెవరోఊహించావా?"

"చిత్తం...నేనే నండి."

"ఇంకెప్పుడూ యిలాంటి తెలివి తక్కువ పనులు చేసి పవిత్రమైన మా కాలాన్ని పాడుచెయ్యకు."

బతుకుజీవుడా అని బయటపడుతున్న పుండరీకాక్షుణ్ణి చూసి తనెంత నవ్వుతున్నాదని! ఆ మాటకొస్తే అదొక అనుభవమా... ఆవాళ మిస్. దైవలీల ఏం చేసిందీ... అదెంత చక్కని అనుభవం!

అసలు ఆ అమ్మాయి తనమీద దాడి చేస్తుందని తెలుసు. అందుకని ఆమె ఎప్పుడు వచ్చినా తలుపులయ్యచేత "దొరగారు ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నారు"; "బాగా అలసిపోయి ఉన్నారు; ఇప్పుడెవరొచ్చినా మాటాడరు"; "నిద్రపోతున్నారు, మళ్ళీ దర్శనం చేసుకోమన్నారు." ఇలా ఎన్నిసార్లో తిప్పించి పక్కకి తిరిగి నవ్వుకోలేదూ? ఆమె అయిదోసారి వచ్చినప్పుడు మాత్రం తలుపులయ్యావెధవ ఒక తప్పటడుగు వేసి ఆమెకు దొరికిపోయాడు.

"దొరగారు చాలా కోపంమీద ఉన్నారు. ఇప్పు డొచ్చినా మీకు పనవదు.''

"పనెలాగా చెడిపోయింది. అందుకోసం కాదు—ఆయనకోపంగా ఉండం తప్పమరేమీ చేతకాదని అందరికీ తెలుసు. నేనూ కోపంగానే ఉన్నాను. నాకుకావలసిందదే, అడ్డులే."

దైవలీల చరచర గదిలోకి వచ్చేసింది.

"మీ రెలాగా ప్రతినమస్కారం పెట్టరు గనక నేనూముందు తొందరపడ్డం లేదు. మీ రెలాగా కూచోమనరు గనక నేనే కూలబడుతున్నాను. నాకు ఓపికలేదు మరి...అది గాక మీతో కొన్ని విషయాలు మాట్లాడి ముఖాముఖీ తేల్చుకోవాలి."

ఏమిటి దీని తెగింపు! నిజంగా తనకే నోటమాట రాలేదు. దైవలీల అక్కడ సుప్రభాతానికి చాలా జబ్బుచేస్తే అప్పటికప్పుడు బెజవాడ వెళ్ళింది. సుప్రభాతానికి మరీ సీరియస్ అయిపోతే ఆమెని నిలిచి రివోపెనింగ్‌దేనాడు వచ్చి సంతకం పెట్టడానికి దైవలీలకి కుదరలేదు. వేసవి శలవులు ఆరునెలల జీతమూ ఆ పరిస్థితుల్లో యివ్వడానికి అడిటర్సు ఒప్పుకోరు స్కూలు క్లోజింగ్ దేనాడూ, రివోపెనింగ్ దేనాడూ సంతకాలు ఉంటేగాని మధ్యకాలం జీతాలు యివ్వరు. అవి రూల్సు. హృదయంలేని వాటినే రూల్సు అంటారు. అది కటిక సత్యం. "స్కూలు తెరిచిన తారీకున నేను యిక్కడ ఉన్నట్టు సంతకం పెడతాను. ఆ మాత్రం మీరు ఆమోదించవచ్చు. ఇందులో ఉపకారమేగాని మీకు ప్రత్యేకించి వచ్చిన నష్టమేలేదు... మీ కిష్టమైతే ఇలాంటివి ఎన్ని జరగలేదు గనక!" అంటుంది దైవలీల. హనుమంతయ్య నవ్వుకున్నాడు. ఆమాట నిజమే. ఎలాంటి రూల్సయినా తారుమారు చెయ్యగల నేర్పరితనం తన కుంది. నిన్న మొన్నటి స్కూలు గుంటలదగ్గిర తనకి మంచిపేరు లేకపోయినా, ఊళ్ళో పెద్దపెద్ద ఆఫీసర్లతో, డబ్బున్నవాళ్ళతో తనకి కావలసినంత పలుకుబడి ఉంది... నిమిషాలమీద ఇంద్రజాలం చెయ్యగల చాకచక్యం తనకుంది. అనేకం చేశాడుకూడా... కాని అవిదే స్వయంగా చెప్పుకున్నట్టు ఇష్టమైతే కదా! ఆ ఇష్టం కలిగించడానికి ఎన్ని ప్రయత్నాలు చెయ్యాలో ఆ పాడు మొహానికేమైనా తెలిసి ఏడిస్తేనా? ఓడజను బత్తాయిపళ్ళయినా తెచ్చి యిచ్చిందీ? ఒకటికి నాలుగుసార్లు తన చుట్టూ తిరిగి కళ్ళనీళ్ళెట్టుకుని బతిమాలిందీ? కొంచెమేనా వినయమూ విధేయతా కనపరచిందీ? పోనీ పెద్దలని గౌరవమైనా చూపించిందీ? నెత్తిమీద మొట్టికాయలు కొడితే ఎవడైనా పని చేసిపెడతాడటండీ? ఏదో పెద్ద హక్కు ఉన్నట్టు సెకండరీగ్రేడు అసిస్టెంటు మాటాడితే పొద్దుట లేచి ఇలాటి వాళ్ళని లక్షా తొంభైమందిని చూసే హెడ్మాస్టరు ఓర్చగలడటండీ? మీరే చెప్పండి?

"మా అక్కకింకా ఏ మాత్రమూ తగ్గలేదు. పిల్లలతో ఎక్కడలేని డబ్బూ చాలడం లేదు. మొన్ననే గాజులమ్మి సొమ్ము పంపించాను...ఇవాళ్ళ జీతం కట్ చేస్తే మేం ఏమైపోవాలో కొంచెం ఆలోచించండి."

"నే చేసే దేమీ లేదు. పైకి కాగితం పెట్టుకోండి కావలిస్తే."

దైవలీల లేచింది. నిప్పులు కక్కింది.

"మీరు చేసే దేమీ లేదా? ఒక శలవు దరఖాస్తుకోసం వారం రోజులూ, ఒక ఇంక్రిమెంటుకోసం ఆరునెలలూ అసహాయ

లయిన మీ అసిస్టెంట్లని మీకూడా తిప్పుకోడానికేనా మీ ఉద్యోగం?"

"ఒకరి చుట్టూ ఒకరు ఆశ్రయించి తిరగడం ప్రకృతిలోనే ఉంది. లేకపోతే ఈ దివారాత్రాలే లేవు. ఈ భూగోళమే లేదు!"

హనుమంతయ్య పెద్దగా నవ్వేడు. దైవ లీల విసురుగా వెళ్ళిపోయింది. తనింత పెద్ద హోదాలో ఉన్నాడని ప్రతి నిద్రమొహానికీ ఏడుపు. ఆ చాతగాని వాజమ్మలు గిలగిల తన్నుకోడం చూస్తే తన కెంత తమాషాగా ఉంటుంది!

"బాబూ, ఇవాళ తమరు కారియరు ముట్టుకోలేదు!"

"నోరు ముయ్యి" అన్నాడు హనుమంతయ్య తన ఆలోచనల్ని భగ్నం చేసిన తలుపులయ్య వైపు కోపంగా చూస్తూ. నెమ్మదిగా నడిచి గదిలోకి వచ్చి లైటు వెలిగించాడు. ఎదురుగుండా కనిపించిందేమిటి? డేట్సు మార్చుకొనే కేలెండరు. ఇంతింత అక్షరాలతో అంకెలతో ఉంది. ఆ పాత సెప్టెంబరు ముప్పై! ఆ మర్నాడే స్కూలు తెరుస్తారు. కుక్కుటేశ్వరస్వామి అప్పుడే ఊళ్లోకి వచ్చాడని తెలిసింది. అతను హెడ్మాస్టరుగా అప్పుడే సంతకం పెడతాడు. ఆయనకు ఆవాహనా, తనకు విసర్జనా అప్పుడే జరుగుతాయి. తన స్థానం, సామ్రాజ్యం, తన సంపద, తన సర్వస్వం కొన్ని గంటల్లో చెయిజారిపోతుంది!

హనుమంతయ్య కిటికీ తలుపులు తెరిచాడు. దూరంగా మినుకు మినుకుమంటూ కొండమీది కోవెలదీపాలు కనిపిస్తున్నాయి. అంతకంటె పైన కొన్ని వేల నక్షత్రాలు. అలా చూస్తూంటే జీవితంలో ఎప్పుడూ ఎరగని నిరాశా, భయం అతన్ని ఆవహించాయి. తలుపులు వేసేసి కుర్చీలో కూలబడి బల్లమీద తలపెట్టుకు పడుకున్నాడు- రోజూలా మడతమంచం వెయ్యలేదు; పరుపుచుట్ట విప్పలేదు; క్యారియరు ముట్టలేదు. అతని కా సమయంలో పచ్చి మంచినీళ్ళుకూడా విషప్రాయమైపోయాయి.

మర్నాడు తెల్లవారేక తలుపులయ్య బలవంతంమీద, హనుమంతయ్య మొహం కడుక్కొని కాఫీ తాగేడు. తొమ్మిదీ. పదీ అయ్యేసరికి స్కూలు దసరా శలవల అనంతరం తెరవడంవల్ల ఎక్కడలేని హడావిడీ. అల్లరీ ప్రారంభమయింది.

"లేనిపోని సానుభూతి వెదజల్లుతూ మేష్టరునక్కాగారు ఒకరూ ఒకరూ నన్ను చూడ్డానికి వస్తారు. నా వంట్లో బాగులేదు. ఎవర్నీ చూణ్ణని చెప్పు...వాళ్ళని తలుచుకుంటేనే నాకు మండుతోంది; ఆ పాపిష్టి మొహాలు ఎలా చూడను!" అన్నాడు హెడ్మాస్టరు. ఎవర్నీ పంపవద్దని హెడ్ క్లర్కు ఏడుకొండలతో చెప్పి తలుపులయ్య తిరిగి మళ్ళీ మూలగది చేరుకున్నాడు.

"బాబూ...తమరికి కోపం రాకపోతే ఒక్క మనవి. తమరికి తెలియదని కాదు... ప్రాణమే శాశ్వతంకాదే, యిక యీ ఉద్యోగం శాశ్వతమా? అక్కణ్ణుంచి కబురు రావాలేగాని మీరేమిటి, నేనేమిటి, అందరం ముందో వెనకో వెళ్ళిపోయేవాళ్ళమేగదా, దాని కింత దిగులు పడిపోతారా?"

హనుమంతయ్యకి వెంటనే చచ్చిపోవాలనిపించింది. తన ఎడమ పాదం కింద మట్టికన్న హీనమైన బంట్రోతువెధవ తనతో యీనాడు సమానస్థుడయిపోయాడా? తనకి నీతులు చెప్పేవాడయ్యాడా?

"పోతావా, పోవా అవతలికి" అని వాణ్ణికూడా తగిలేసితలుపు గడియవేశాడు. ఇటుతిరిగాడు. ఇటు తిరిగి చూశాడు. అతనికి ఆ గదిలో ఇంకేమీకనబడలేదు-తనుకూర్చునే కుర్చీ తప్ప. తనకి హోదా, గౌరవమూ, మర్యాదా, మన్ననా, ప్రతిష్ఠా ప్రాధాన్యమూ ఇచ్చిన ఈకుర్చీ ఆనాటినుంచీ మరొకరిది! తన జీవనాడి, తనని ప్రతిక్షణం పాలించే చైతన్యచిహ్నం మరుక్షణం మరొకరిది.

కన్న తండ్రిగాని, రక్తం పంచుకు పుట్టిన తమ్ముడుగాని, 'అన్నిటినీ కనిపెట్టి చూసే ఆ తండ్రి'గాని, 'ప్రతినిత్యం కొలువు చేసే యీ తండ్రి' గాని 'ఏడాది కోసారి విజిట్ చేసే నెత్తిమీద చుట్టమైనతమ్ముడు' గాని ఆఖరికి భార్యాబిడ్డలుగాని హనుమంతయ్యగారికాఖరుక్షణంలో మనసులో మెదలలేదు. నిమిషాలు గడిచేకొద్దీ ప్రాణం వదలివెళ్ళలేని రోగిలా ఆ కుర్చీవైపు అతి హృదయ విదారకంగా చూస్తూ కూచున్నాడు.

తలుపు చప్పుడయింది. మళ్ళీ, మళ్ళీ, మరింత గట్టిగా - 'వెర్రివాడా, పదవే పరమార్థమా? హోదా శాశ్వతమా? ఇవాళ నుంచి నేను మరొకరి సొత్తు కానా?' కుర్చీ నవ్వినట్టయింది. సింహాసనంకోసం రాజులూ, పదవికోసం మంత్రులూ, చావు బతుకుల సమస్యలా ఎలా పోరాడతారో వివర్ణమైన ఆయన మొహంలోని నీడలు చూసి తెలుసుకోవచ్చు. అయినా హనుమంతయ్యగారికి అపజయంలేదు. 'చూడు నిన్నేం చేస్తానో చూడు' అన్నాడు. మూడంతస్తుల మేడమీది కిటికీలోనుంచి ఆ కుర్చీ బలంకొద్దీ విసిరేశాడు. తర్వాత తనే అక్కణ్ణుంచి గెంతేశాడు! బొందితో కైలాసం చేరుకోకపోవచ్చు-కాని పదవితో పైలోకం చేరుకున్నాడు! తక్కువ ప్రయోజకత్వమా!

